
# అమృతంగమయ

"సుబ్బారావన్నయ్య మీకోసం మూడుసార్లు ఫోన్ చేశాడు. రాగానే మిమ్మల్ని మాట్లాడమన్నాడు. అర్జంటుట" టీ గ్లాసు అందిస్తూ చెప్పింది శకుంతల.

"రాత్రి రాగానే చెప్పి ఏడవచ్చుగదా! ఇప్పుడా చెప్పేది? అవతల నాకు ఆఫీసు టైమయింది. ఇప్పుడు వీడితో మాట్లాడుతూ కూర్చుంటే బస్సు తప్పిపోగలదు. ఆలస్యమైతే మా చండామార్కులవారు మాటలతో కాదు... చూపులతోనే హింసిస్తాడు. నువ్వొక తిక్కలదానివి దొరికావు నాకు. అర్జంటు విషయాలు ఆలస్యంగా చెప్తావు. ఆలస్యంగా చెప్పవలసిన విషయాలు టుపుక్కున చెప్తావు..." కోపమంతా మా ఆవిడ మీద చూపించాను.

"రాత్రి తమరు నేను చెప్పిన విషయాలు అర్థం చేసుకునే స్థితిలోనే వచ్చారా? ఇంటి ముందే పడిపోతిరి. తమరు నిద్రలేచి అరగంట అవుతోంది. తమకు విన్నవించుకోవడానికి ఇప్పటికి వీలుపడింది. పైగా నన్ను తిట్టడం. మీరన్నట్లు నేను తిక్కలదాన్ని కాబట్టే మీ ఆటలిలా సాగుతున్నాయి. ఇంకొకతైతే ఈ పాటికి మీకు విడాకులిచ్చేది లేదా గృహహింస కేసు



బి.విజయ

పెట్టి, కటకటాల్లోకి నెట్టించి, చిప్పకూడు తినిపించేది... రివర్స్‌గేర్‌లో నన్ను వాయిస్తూనే టపటపా నంబర్లు నొక్కి ఇదిగో... అన్నయ్యా గారితో మాట్లాడండి... అంటూ సెల్ నా చేతి కందించింది.

అవతల నుండి సుబ్బారావు అసలు విష యం సూటిగా చెప్పాడు. "శంకర్ మూడు రోజుల నుండి షాపుకు రావటం లేదురా. తన గదిలోనే మూడీగా ఉన్నాడు. అన్నం కూడా సరిగా తినటం లేదు. ఉద్యోగం మానేసి ఊరెళ్లి పోతానని ఒకటే గొడవ. సాయంత్రం నువ్వు ఆఫీసు నుంచి డైరెక్ట్‌గా ఇటు వచ్చెయ్. నీవు వస్తేగానీ వ్యవహారం చక్కబడదు..."

"సరేలే! తప్పక వస్తాను" అంటూనే ఫోన్ పెట్టేసి, గడపదాటాను ఆఫీసుకు బయలు దేరుతూ.

"వెళ్లేది బ్రాందీ షాపుకి. అందులోనూ సుబ్బారావన్నయ్యషాపుకి. రాత్రిలాగా పడిపోయే టట్లు లాగించకండి. పెందలాడే వచ్చేయండి" నేను మెట్లుదిగేవరకూ నా వెనకాలే వస్తూ, ఉ చ్ఛస్వరంతో క్లాసు పీకుతూనే ఉంది మా ఆవిడ. ఈవిడగారి నోటికి తాళం పడాలంటే నేను తొందరగా సందు దాటటమే మేలు అనుకుం టూ గబగబా నడిచాను. తాగొద్దు... అనదు. ఎక్కువ తాగొద్దు అని ముద్దుముద్దుగా చెప్తుంది.

నేను బస్‌స్టాప్ దగ్గరకు వచ్చేసరికి నేను ఎక్కవలసిన బస్సు ఖాళీగా రావటం, సంతో షంగా ఎక్కటం జరిగిపోయాయి. కిటికీప్రక్క సీట్లో కూర్చున్నాను. వాతావరణం చల్లగా ఉంది. దానికి తోడు బస్సుకదులుతూంటే... కిటికీలోనుంచి వచ్చే గాలి తోడై మనసంతా హాయిగా వుంది. బస్సు ముందుకు దూసుకు వెడుతూంటే నా ఆలోచనలు శంకర్ చుట్టూ పరిభ్రమించాయి.

శంకర్‌ది మా ప్రక్క ఊరే. మా కులంవాడే. చదువులో చాలా చురుకైనవాడు. ఉద్యోగరీత్యా భాగ్యనగరం వచ్చినా, ప్రతినెలా ఒక్కసారైనా మావూరువెళ్లి, మా వాళ్లను చూసి రావటం ఇప్పటికీ జరుగుతూనే వుంది. శంకర్ వాళ్ల ఊర్లో రైలుదిగి, పొలాల గుండా ఒకమైలు దూరం నడుచుకుంటూ వెడితేగానీ మా ఊరు రాదు. ఒకసారి మా ఊర్లో 'ఐద్వా'వాళ్లు 'మధ్య తరగతి కుటుంబాలలో స్త్రీ జీవనం' అనే విష యం మీద ఒక చిన్న పాటి సభ జరిపారు. ఆ రోజు మా వూళ్లోనే వుండటంవల్ల నేనూ హాజ రయ్యాను. అందరూ మాట్లాడటం పూర్తయ్యా క... ఈ టాపిక్‌పై ఇంకెవరైనా మాట్లాడదలచు కుంటే మాట్లాడవచ్చు అంటూ సభలో ఉన్న వారికి ఆహ్వానం పలికారు.

ఎవరూ రారులే అనుకున్నాం. ఆ సమయం లో శంకర్ వేదిక మీదకు వచ్చి పదినిమిషాల పాటు అద్భుతంగా మాట్లాడి, అందరి అభినంద నలూ అందుకున్నాడు. మా ఊర్లో వున్న మధ్య తరగతి ఇళ్లల్లో వాళ్లను దృష్టిలో ఉంచుకొని మాట్లాడాడు అని స్పష్టంగా అక్కడున్న అందరికీ అర్థమైంది. తొమ్మిదవ తరగతి చదువుకునే ఆ పిల్లవాడి సునిశిత పరిశీలనా దృష్టి నాకు నచ్చిం ది. అంతేగాక అతడు చదువులోను, ఆటల్లోను, పాటల్లోనూ అన్నింటా ఫస్టే అని తెలుసుకు న్నాను. సామాన్యంగా ఆటలలో బాగా ఉండే వాళ్లు చదువులో అంతంతమాత్రంగా వుంటా రు. చదువులో బాగా ఉండేవాళ్లు ఆటల్లో చురుగ్గా కనిపించరు. శంకర్ అన్ని విషయాల్లో మేటి అని తెలిసినపుడు మా గ్రామానికి మరీ ముఖ్యంగా మా కులానికి ఒక రత్నం లభించిందని సంబరపడ్డాను. నాకు కులాభి మానం లేదని అబద్ధాలు ఆడను. నాకు నా

కులమన్నా, నావాళ్లన్నా, నాభాషన్నా విపరీత మైన అభిమానం. అలాగని ఇతర కులాలపట్ల, మతాలపట్ల, భాషల పట్ల దురభిమానం లేదు. నలుగురినీ అభిమానించి, గౌరవించి, ఆదరించి కలిసిపోయి మనమూ, మనజాతి, మనభాష అభివృద్ధిని సాధించాలని నా అభిమతం. వ్యక్తిగతంగా నా వాళ్లకు అందుబాటులో ఉండి సాయపడతాను. అండగా నిలబడతాను. ఒకరి పట్ల విపరీతమైన అభిమానాన్ని, మరొకరిపట్ల విపరీతమైన అయిష్టాన్నీ పెంచుకోను. సమత నా కులం. మానవత్వం నా జాతి. సమైక్య భావన నా భాష.

ఏమిటి సార్, స్టాప్ వచ్చినా దిగేటట్లు లేరు... అన్న కండక్టర్ మాటలకు నా ఆలోచనలనుంచి ఈలోకంలోకి వచ్చాను. బస్సుదిగి సిగరెట్ ముట్టించి, ఆఫీసువైపు అడుగులు వేశాను. మళ్లీ శంకర్ ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి.

శంకర్ పదో తరగతి పాసయ్యాడు. మండలానికే ఫస్ట్. నేను ఎప్పుడు మా ఊరు వెళ్లినా బండిదిగి, పొలాల్లోకి రాగానే నా కళ్లు అప్రయత్నంగా శంకర్ కోసం చూసేవి. పొలాల్లో గేదెలు కాస్తూనో, కలుపుతీస్తూనో నాక్కనిపించేవాడు. నన్ను చూడగానే వచ్చి నా బ్యాగ్ తీసుకొని, మా ఇంటివరకూ వచ్చేవాడు. చదువు గురించో, ఉద్యోగాల గురించో, రకరకాల కోర్సుల గురించో ప్రశ్నలు వేస్తూనే ఉండేవాడు. అతని చురుకుదనాన్ని గమనించి, అతని సందేహాలను నివృత్తి చేస్తూ ప్రోత్సహించేవాడిని.


తాటిచెట్టు మీదనుండి క్రిందపడి అతని తండ్రి కాలు విరగటం, వాళ్ల పెద్దన్నయ్య మందుకు బానిసై అది దొరక్క స్పిరిట్ త్రాగి చనిపోవటం, వాళ్లక్క భర్త గుండె ఆగి మరణించటం వంటి సంఘటనలు చకచకా జరిగిపోయాయి. దానితో అతని కుటుంబ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. చదువు చాలించి, కల్లుగీయడానికి వెళ్లమని తల్లిదండ్రులు పోరుపెట్టసాగారు. ఏ పనికైనా వెడతాను గానీ, ఆ పని చేయనని, అది వ్యసనమై మనిషి ప్రాణాలు తీసే మహమ్మారి అని అతని వాదన. పదిమందికీ హాని జరిగే ఆ వృత్తి చేయనని మొండికేసాడు. వాళ్లతో వాదించి లాభంలేదని నా దగ్గరకు వచ్చాడు. తన బాధను, ఆవేదనను, ఆలోచనలనూ నాకు చెప్పాడు. అన్నీ విన్న తరువాత అతనికి కొన్ని వాస్తవాలు చెప్పాలనిపించింది.

"వ్యవస్థను బాగుచేయాలనే నీ ఆశయం చాలా గొప్పది. అటువంటి ఆశయాన్ని సాధించాలంటే నలుగురికీ చెప్పే స్థాయికి నీవు ఎదగాలి. కల్లు, సారా, బ్రాందీ వంటి వాటిని తయారుచేయటం, అమ్మటం తప్పా? ఒప్పా? అని ఆలోచించవలసిన వయసూ, పరిస్థితి కూడా కాదు నీది. నీవు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే చదువు చాలా అవసరం. శివుడికి మూడోకన్ను లాగా మనిషికి చదువు ఒక శక్తివంతమైన ఆయుధం. నీవు బాగా చదవాలి" అన్నాను సూటిగా, స్పష్టంగా.

"నాకు బాగా చదువుకోవాలని ఉంది సార్" అన్నాడు.

నేను తనను ప్రోత్సహిస్తానని నమ్మకం, చదివిస్తానన్న ఆశ అతని కళ్లల్లో కనిపించింది.

ఒక పని చేద్దాం. నిన్ను మా సుబ్బారావు బ్రాందీ షాపులో చేరుస్తాను. పగలు కాలేజీకి వెళ్లి చదువుకో. సాయంత్రం షాపులో ఉండి పనిచేయి. పనిచేస్తూ ఆదాయం పొందే మార్గం ఇదే. ఇంతకన్నా వేరే దారి లేదు. ఇంతకన్నా సులభంగా లభించే ఉద్యోగమూ లేదు.




"మందు అమ్మడం నా వల్ల కాదు సార్" సూటిగా, స్పష్టంగా తన అభిప్రాయాన్ని నొక్కి చెప్పాడు. అతడికి ఈ వృత్తి పట్ల విముఖత ఏర్పడింది. మా కుటుంబాల్లో వాళ్లు పడే బాధలు చూసి ఆ నిర్ణయానికి వచ్చాడు. జీవితం మొదట్లోనే ఉన్నవాడు. కొంత కన్విన్స్ చేయవలసిన అవసరం ఉంది.

"నీకు టాలెంట్ ఉంది. ముందు డిగ్రీ పూర్తి చెయ్యి. ఆ టాలెంట్‌ని ఉపయోగించుకో. ఆ టాలెంట్‌ని సక్రమ మార్గంలో ఉపయోగిస్తేనే ఉన్నతమైన లక్ష్యాన్ని చేరుకోగలవు. అప్పటి వరకూ ఇటువంటి అభిప్రాయాలను నీ మనసులోనే ఉంచుకో. అమలుపరిచే అవకాశాన్ని, స్థాయినీ పొందు. అప్పుడు నిబద్ధతగా అమలు చేయి. ముందు చదువుకో..." ఆదేశించినట్లుగానే చెప్పాను. మౌనమే సమాధానం.

అతడికి అవసరం ఉంది. అందుకే మెత్తబడ్డాడు. కన్విన్స్ చేయడానికి ఇది మంచి అవకాశం. అందుకే అతనికి 'ధర్మవ్యాధుడు కథని వివరించాను. వృత్తిపరమైన ధర్మాన్ని నిర్వర్తిస్తూనే వ్యక్తిగతమైన ధర్మాన్ని కూడా చక్కగా నిర్వర్తించిన వ్యక్తి వ్యవస్థను శాసించి, మార్చగలిగే శక్తిని పొందుతాడని చెప్పాను. ఒక పద్మంలా విద్యాజ్ఞానంతో వికసించి ప్రతిభా పరిమళాలు వెదజల్లవలసిన బాధ్యత ఉందని చెప్పి ఒప్పించాను.

మీ ఇష్టం సార్... నేను చదువుకోవాలి. అంతే... నాకు మీరు తప్ప ఇంకెవరూలేరు అన్నాడు. చదువు పట్ల ఉన్న ఆసక్తితోపాటు నా మాటలు అతని మీద బాగానే పనిచేసాయి. అందుకే మెత్తబడ్డాడు.

శంకర్‌ని సుబ్బారావు షాపులో చేర్చాను. వాడూ నాపట్ల ప్రేమాభిమానాలు కలిగిన వాడు కాబట్టి తన ఇంటిలోనే ఓ గది ఇచ్చి, చదువు

కునే అవకాశం కల్పించాడు. బ్రాందీషాపులో లెక్కలు వ్రాయటం, బిల్లులు చూడటం... వంటి పనులు అప్పగించి, వాళ్ల కుటుంబానిక్కూడా ఆర్థికంగా అండగా ఉంటున్నాడు. శంకర్ డిగ్రీ ఫైనల్ చేస్తున్నాడు. పనిలో చాలా సిన్సియర్. క్రమశిక్షణగల సైనికుడిలా ఉంటాడు.

అప్పుడప్పుడూ ఏదో ఒక సంఘటన చూసి, ఇలా మూడీ అవుతుంటాడు. అప్పుడు మళ్లీ నా జ్ఞానబోధ అవసరం అంటాడు సుబ్బారావు. ఎందుకో తెలియదుగానీ శంకర్‌కి నా మాట వేదవాక్కు. నేను మంచివాడినని, తనకు మంచి చేస్తానని ఒక నమ్మకం. నా తరువాతే మిగిలిన వాళ్లు అతనికి. సాయంత్రం శంకర్‌ని హోటల్ స్వాతికి వెళ్లి కలవాలని నిర్ణయించుకున్నాను. ఇంతలో ఆఫీసు రావటంతో నా ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి ఆఫీసులోకి ప్రవేశించాను.

* * *

శంకర్ చెప్పిన విషయం విని నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు నాకు. సుబ్బారావు, నేను, శంకర్, నా కొలీగ్ మస్తాన్, మా సుబ్బారావు నైబర్ మరియదాసు... అందరం కూర్చున్నాం. మేనెలైనా వాతావరణం చల్లగా హాయినిస్తోంది. రెండు రోజుల నుంచి సాయంత్రమయ్యేసరికి వర్షం పడుతుందేమో అన్నట్లుగా ఉంది. కానీ పడదు. ఆహ్లాదకరమైన ఈ వాతావరణంలో రూఫ్‌గార్డెన్‌లో కూర్చొని. బీరు సేవిస్తూ కబుర్లాడుకుంటూంటే ఉండే మజాయే వేరు. నేను ఎనిమిదవ తరగతిలో ఉండగానే కల్లు రుచిచూశాను. మా నాన్నే స్వయంగా నాచేత కల్లు త్రాగించాడు. వేసవిలో మా కజిన్స్‌తో తాటితోపుకు వెళ్లి కల్లు త్రాగేవాడిని. అంతకంటే దాటి ముందుకు వెళ్లలేదు. కానీ గత వేసవికి విస్కీకి మరిగాను. నాలుగైదుసార్లు అతిగా తాగి ఇంటికి రావటం చూసిన శ్రీమతి చాలా బాధపడింది. ఆమెను బాధపెట్టటం ఇష్టంలేక మానేసాను. మళ్లీ చాలా కాలం తరువాత రాత్రి ఓ కస్టమర్ ఇచ్చిన పార్టీలో కొంచెం ఎక్కువ తీసుకున్నాను.

నేనంటే గౌరవమున్న శంకర్ ముందు త్రాగాలంటే గిల్టీగా వుండి మాజా తీసుకున్నాను. శంకర్‌కూ మాజా ఆఫర్ చేశాను. మా సుబ్బారావు మందు అమ్ముతాడు గానీ త్రాగడు. వాడు కోకాకోలా పట్టుకున్నాడు.

శంకర్ తన మూడీకి కారణాన్ని అడిగిన వెంటనే సూటిగా స్పష్టంగా చెప్పాడు. "ప్రభుత్వం సారావంటి మత్తుపదార్థాలను నిషేధించింది. నాకు చాలా గిల్టీగా ఉంది. నేను ఇంకేదైనా పని చూసుకుంటాను. వ్యక్తినేగాక అతని కుటుంబాన్ని కూడా నాశనంచేసే ఇటువంటి పాపకార్యంలో భాగస్వామ్యం కాలేను... ఇదీ అతని మాటల సారాంశం.

"నాల్గురోజులు క్యాంపుకు వెళ్లి వచ్చేసరికి, నా ముందు భలేసమస్యను ఉంచాడే..." అన్నాను ఏంచెప్పాలా అని ఆలోచిస్తూ.

"మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేయన్నా... అన్నాడు మరియదాసు సరదాగా... వాతావరణాన్ని తేలికచేసే ప్రయత్నంతో.

అబ్బే! అలాంటి వాడు గాదయ్యా! ఈ రోజుల్లో ఉండాల్సినవాడుగాదు కుర్రోడు" అన్నాడు సుబ్బారావు.

అతనికి చాలా ఆశయాలున్నాయి. ఆలోచనలున్నాయి. ఏదో సాధించాలని పట్టుదల వుంది అన్నాను ప్రశంసిస్తూ. అతనిలో ఉన్న ఆత్మన్యూనతాభావాన్ని ప్రశంసాపూర్వకంగా ఉత్తేజితం చేసి, అతన్ని ముందుకు నడిపించాలని నా ఆశ.

"అట్లాంటోడు ఇయ్యన్నీ పట్టించుకోగూడ

దు. తప్పా? ఒప్పా? అనికాదు. అనుకున్న పని అవుద్దాకాదా అని ఆలోచించాలి" అన్నాడు మస్తాను. 'లక్ష్యం ఉన్నవాడు ఆ లక్ష్యం వైపే దూసుకుపోవాల'ని అతని భావం.

ఇది మాత్రం కరెక్ట్ అన్నాను వెంటనే. అంటూనే శంకర్ వైపుచూస్తూ "చూడు శంకర్! అవినీతి, లంచగొండితనం, మాదకద్రవ్యాల అమ్మకం ఇవన్నీ చెడ్డపనులు, సమాజాన్ని పట్టి పీడించే భూతాలు. ఇవి దేశప్రగతికి క్యాన్సర్ లాంటివే. కాదనను. ఇక ఉద్యమాలంటావా? అవి స్వాతంత్ర్యంతోనే అంతరించాయి. ఇప్పు డొస్తున్న ఉద్యమాలు ఉద్యమాలేకాదు. రాజకీ యనాయకులు, అధికారులు తమను పైకెత్తుకొ ని, ఎదుటివాడిని నిందించడానికి ఈ ఉద్యమా లను ఉపయోగించుకుంటున్నారు. తాము ప్రతి పక్షంలో ఉన్నప్పుడు "బ్రాందీ షాపులకు లైసెన్సు లివ్వం, మద్యపాననిషేధాన్ని అమలుచేస్తాం" అంటూ ఊదరగొట్టేస్తారు. అధికారంలోకి వచ్చా క వాస్తవాలు కళ్లముందు మెదిలి, ఆదాయం కోసం జావగారిపోయి అమలు చేయరు. ఇదే మళ్లీ ప్రతిపక్షానికి ఆయుధం. ఒక మంచి ఆలో చనతో ఉద్యమం ప్రారంభమైనా, దాన్ని రాజ కీయ నాయకులు తమ చేతుల్లోకి తీసికొని, తాము అధికారంలోకి రావడానికో, అధికారం లో ఉంటే కీర్తిప్రతిష్ఠలు సాధించడానికో ఈ ఉద్యమాలను వాడుకుంటారు. బలయ్యేది ప్రజ లే. అసలు ఇలాంటి విషయాలు నీకనవసరం. ఇలాంటి వాటిగురించి ఆలోచించకు. గీతోప దేశం చేస్తూ చెప్పటం ఆపి, అతనివైపు పరి శీలనగా చూశాను. నా మాటలు శ్రద్ధగా ఆల కిస్తున్నాడు.

"శంకర్! అన్నీ తెలిసినవాడివి. డిగ్రీ ఫైనల్ వరకూ వచ్చావు. మళ్లీ వెనకటికొస్తే ఎలా? తప్పొప్పుల గురించి ఆలోచించవద్దని నీకెన్నో సార్లు చెప్పాను. నీముందు చాలా బాధ్యతలున్నా యి. నీ కుటుంబానికి నీవే ఆలంబన. నీ లక్ష్యాన్ని మధ్యలో ఆపేస్తే ఎలా?" ప్రశ్నించాను. అతని కుటుంబ పరిస్థితులను గుర్తుచేస్తే మెత్త బడతాడని నా నమ్మకం.

"కాదుసార్, ఎంతవద్దనుకున్నా నా మనసు సమాధానపడడంలేదు. నాకన్నా చిన్న వాళ్లు కూడా మందు త్రాగుతున్నారు. సంసారాలు కూలిపోతున్నాయి. బ్రాందీషాపు ద్వారా వ్యక్తులు బలహీనతలను సొమ్ముచేసుకుంటున్నాం. వాళ్ల బలహీనతతో మనం బలవంతులం అవుతున్నా మనిపిస్తుంది. అపరాధభావన నన్ను పీడిస్తోం ది. వ్యవస్థ బలిహీనమౌతుంటే మనం మన సంగతి చూసుకుంటే ఎలా సార్? మొన్నటి సమావేశంలో ఒక పెద్దాయన ఈ వ్యసనాన్ని విశ్లేషించి వివరిస్తూంటే సారాబట్టీలను తగుల బెట్టి, బెల్టుషాపులను నాశనం చేయాలనిపిస్తోం ది సార్" బాధగా అన్నాడు.

ఒక విధంగా చెప్పాలంటే శంకర్‌లో వయ సుకు మించిన ఆలోచనలున్నాయి. కాకపోతే కల్లుగీత కార్మికులు ఎందరు లేరు? బ్రాందీషాపు లు నిర్వహించేవాళ్లు ఎందురులేరు? అకేషన్‌కో, సరదాకో అప్పుడప్పుడూ త్రాగేవాళ్లుంటారు. వాళ్లు బలహీనులుకారు. సమయం, సందర్భం చూసుకొని ప్రవర్తిస్తారు. మరికొంతమంది ఇటు వంటి వాటికి బహుదూరం... సుబ్బారావు లాగా. ఎటొచ్చీ ఎక్కువగా త్రాగి, బలహీనులైన వ్యసనపరులే నాశనమయ్యేది. ఈ వ్యసనం ఆ వ్యక్తినేగాక అతడిని నమ్ముకున్న కుటుంబాన్ని కూడా నాశనం చేస్తుందనేది వాస్తవం. మా ఊళ్లో మా కుటుంబాల్లో వాళ్లే కల్లు గీస్తూ, దానికి అలవాటుపడి, ఆ మత్తు చాలక, విస్కీ లాంటి వాటికి లొంగి, వ్యసపనరులై ఎంతో మంది దెబ్బతిన్నారు. తనచుట్టూ ఉన్న ఆ

కుటుంబాలను చూసిన శంకర్, ఈ సంఘటనలకు చలించటం వల్ల అతనిలో ఈ ఆత్మన్యూనతాభావం ఏర్పడింది. తాత్కాలికంగా మా మాటలకు కన్విన్స్ అయినా. ఏదైనా సన్నివేశమో, సంఘటనో చూసినప్పుడు అది మళ్లీ చిగురించి, అతన్ని ఇబ్బంది పెడుతోంది. ఒక రెండు నిమిషాల పాటు కళ్లు మూసుకొని ఆలోచించి, మళ్లీ మొదలుపెట్టాను.

"చూడు శంకర్... వేశ్యావృత్తి, జోగిని వ్యవస్థ, సారా తయారి, మత్తు పదార్థాలు, లాటరీ, గుర్రప్పందాలు, రికార్డింగ్ డ్యాన్సులు... ఈ వ్యవస్థని రాచపుండులా నశింపజేసేవి చాలా ఉన్నాయి. ఇవి ఒక్కనాడు, ఒక్క వ్యక్తి వల్ల పోవు. కొన్ని దురాచారాలు ఎన్నో ఉద్యమాలను దాటుకొని, అనుభవంలోకి వస్తేనేగాని, తద్వారా మనుషుల్లో మార్పువస్తేనేగానీ పోవు. నీవు వాటిగురించి తీవ్రంగా ఆలోచిస్తున్నావు. అందువల్లనే ఎంతో వేదనను అనుభవిస్తున్నావు. ఈ వయస్సులో నీలాంటి వాళ్లకు అన్నీ ఇలాంటి ఆలోచనలే వస్తాయి. నీవు ఒక చిన్న పరిధిలో ఉండి, దానినే గమనిస్తున్నావు. ముందు బి.ఏ. పూర్తిచేయి" అన్నాను కొంచెం కోపంగానే.

"పోనీలేరా... బ్రాందీ షాపులో పనిచేయవద్దు. అలాపనిచేయటం బాధగా ఉందంటున్నాడుగా. ఇన్నాళ్లూ వేరే ఎక్కడా ఉద్యోగం చూసే అవకాశం లేక, ఒకవేళ వచ్చినా అతనికి చాలదని నాదగ్గర అట్టే పెట్టుకున్నాం. ఒక పని చేద్దాం. నాకు తెలిసిన చార్టర్డ్ ఎక్కౌంటెంట్ ఉన్నాడు. అక్కడ జాయిన్ చేద్దాం" అన్నాడు సుబ్బారావు.

"వాడిచ్చే వందాయాభై ఇతగాడి తిండికే చాలవు. ఏదో నీవు అభిమానంతో వాళ్ల ఫ్యామిలీకి కావలసింది ఇస్తున్నావు గానీ వేరేవాళ్లు ఇస్తారా?" అన్నాను. శంకర్ జీతం ఇంత అని వాడు అనలేదు, నేను చెప్పలేదు. నా ప్రాణ స్నేహితుడు కాబట్టి, వాడిదీ ఆ కులమే కాబట్టి ఆ అభిమానంతో శంకర్ కుటుంబానికి అండగా ఉంటున్నాడు.

"ఆ సి.ఏ. కూడా బ్రాందీషాపులు, బెల్టు షాపుల అక్కౌంట్స్ ఆడిట్ చేస్తాడు గదా" అన్నాడు మరియదాసు.

నేనేదో అనబోయేంతలోనే శంకర్ అటు వైపుతిరిగి, "నమస్తే సార్! అంటూ ఒక్క ఉదుటునలేచి, ముందుకు నడిచి అవతలి వ్యక్తిని కరచాలనం చేశాడు. ఆ వ్యక్తి కూడా అలాగే షేక్‌హాండిచ్చి "బాగున్నారా, అన్నాడు. శంకర్ అతన్ని మాటేబిల్ దగ్గరకు తీసుకువచ్చి "వీరే ఎమ్మీ సార్" అన్నాడు. "మొన్న మీటింగ్‌లో అదరగొట్టేశారు" అంటూ మమ్మల్ని పరిచయం చేసాడు మెరిసేకళ్లతో.


ఆయన మర్యాదపూర్వకంగా మా అందరికీ కరచాలనంచేసి, వస్తాను సార్... అంటూ ముందుక్కదిలాడు.

నేనెందుకో శంకర్ వైపు చూశాను. శంకర్ అతన్ని ఒక ప్రవక్తను చూసినట్లు చూస్తున్నాడు. ఆయన శంకర్‌ని బాగా ఇన్‌స్పైర్ చేసినట్లున్నాడు. పదిమందిని ఆలోచింపజేసి, ఆవేశింపజేసి, ప్రగతిపథంవైపు నడిపించగల వ్యక్తులే కావాలి ఈ వ్యవస్థకు" అని నాలో నేనే ప్రశంసాపూర్వకంగా అనుకున్నాను.

ఆయన మన బార్‌అండ్ రెస్టారెంట్‌కి ఎందుకు వచ్చినట్లో? అన్నాడు మస్తాను వ్యంగ్యంగా.

అదేంటి మస్తాన్... అలా అంటావు. భోజనం కోసం వచ్చారేమో అన్నాడు మరియదాసు. మస్తాను అలా మాట్లాడటం నాకూ నచ్చలేదు.

భలేవాడివన్నా. భోజనం కోసం ఏ ఉడిపీ




కో... కామత్‌కో వెళ్లవచ్చు కదా! వాటిని దాటు కొని ఇంతదూరంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌కి రావటం ఎందుకు? అన్నాడు మస్తాన్ పాయింట్ లాగుతూ.

"సార్ అలాంటి వాడు కాదు.. ఏదో ఫ్రండ్స్‌తో వచ్చి ఉండవచ్చు" అన్నాడు శంకర్ ఉక్రోషంగా.

మాటలు అందరూ చెప్తారు... అన్నాడు మళ్లీ మస్తాన్.

శంకర్ ఆగలేదు. మస్తానన్నా, తొందరపడి ఎవరినిబడితే వాళ్లను ఎంతమాటపడితే అంత మాటనకు... అంటూ విసురుగా ఏదో అనబోతుండగా –

పోనీ ఒకసారి వెళ్లి గమనించి రారాదూ! వాదనలెందుకు? అన్నాడు సుబ్బారావు.

శంకర్! ఇలారా... అన్నాను. వాదన జరగటం నాకెందుకో ఇష్టం లేదు. ఈలోగా మరియదాసు అటు వెళ్లటం చూసాను.

మీ అక్క కొడుక్కి చెవిపోగులు కుట్టించాలన్నావు. ఎప్పుడు? అన్నాను. ఇస్యూని డైవర్ట్ చేయాలని నా ఉద్దేశ్యం.

26వ తేదీ... ఆదివారం సార్ అన్నాడు. అనీజీగా ఉన్నాడు శంకర్. మొహం కందగడ్డలా మారింది ఆ ఎమ్మీగారిని విమర్శించినందుకు ఫీలవుతున్నాడు.

డబ్బులేమైనా కావాలా? అని అడగబోతున్నా. ఇంతలోనే మరియదాసు వచ్చి... 'మందు కోసమే' అన్నాడు ముక్తసరిగా.

ఆ మాట మరియదాసు నుండి వచ్చీరాగానే, శంకర్ అటువైపు వెళ్లాడు. నేనూ అటు కదిలాను. శంకర్ ఇందాకనే ఆయన్ని ఫాలో అయ్యేవాడే. నేను పిలిచి, తన విషయం మాట్లాడుతున్నాను కాబట్టి మర్యాదకోసం ఆగాడు.

ఇంతలో ఇస్యూ డైవర్ట్ అయింది. శంకర్

ఆయనను ఆరాధిస్తున్నాడు. ఒకవేళ మస్తాన్, దాసు అన్నట్లు ఆయన మందుత్రాగితే చూసి శంకర్ తట్టుకోలేడు. అసంకల్పితంగా శంకర్ వెనుకే నడిచాను.

"అందరం బీరుతోనే సరిపెట్టుకోవాలి. తప్పదు... అన్నాడు సలహాపూర్వకంగా ఎమ్మీకి ముందు కూర్చున్న వ్యక్తి. శంకర్ ఎమ్మీ వెనుక ఓ ప్రక్కగా నిలబడ్డాడు.

"మొత్తానికి అన్న యమా ఊపాడురా! జనం నుంచి స్పందన బాగా వచ్చింది. ఉద్యమం ఇంకాస్త ఊపందుకుంటే చాలు... అన్నకు మద్యపాననిషేధ కమిటీ ఛైర్మన్ రావచ్చు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేనో, ఎమ్మెల్సీనో అవుతాడు" అన్నాడు ఎమ్మీకి ప్రక్కనున్న వ్యక్తి.

"కనీసం పార్టీ టౌన్ ప్రెసిడెంట్ అయినా చాలు భాయ్! ఖర్చు మొత్తం నాదే. నీ గెలుపు ఖాయం. నాకు మాత్రం ఆ గ్రంథాలయ ఛైర్మన్ వచ్చేట్లు చూడు" ఇవతలగా కూర్చున్న వ్యక్తి అంటున్నాడు.

ఎమ్మీ బీరు చప్పరిస్తూ, చిరునవ్వులు చిందిస్తున్నాడు.

"ఏదన్నా మాట్లాడన్నా. నీమాటలు భలే మజాగా ఉంటాయి. వాగ్ధాటిలో అన్నను మించి నోడులేడు" అన్నాడు మరో వ్యక్తి.


"మండే ఎండకు మందే ఉపశమనం" అన్నాడు భావయుక్తంగా ఎమ్మీ. అంతా వహ్వా అన్నారు.

శంకర్ బొమ్మలా అచేతనంగా నిలబడి ఉన్నాడు. శంకర్ చేయిపట్టుకుని ఇవతలకు లాక్కొచ్చాను. శంకర్ నావెనుకే తల్లివెంట నడిచే లేగదూడలా వచ్చాడు. కుర్చీలో కూర్చోబెట్టాను. అతడు జరిగిన సంఘటనను జీర్ణించుకోలేక పోతున్నాడు. అతని మొహంలో ఇందాకటి కాంతి లేదు.

మా జీవితాల్లో ఇలాంటి సంఘటనలు చాలా తారసపడ్డాక, జీవితంలోని వాస్తవాలను గమనించుకొని అందరూ నడిచే దారిని నడుస్తున్న సామాన్య మానవులం మేం. శంకర్ అలా కాదు. జీవితపు ప్రారంభదశలో ఉన్నవాడు. ఇంకా లోతుగా సమాజాన్ని చూడాలి. వయసు పరిణతి చెందితేగానీ మరింత మార్పు రాదు. అప్పుడు ఆలోచించి, ఆశయాలవైపు అడుగు వేస్తే మంచి నాయకుడౌతాడు. అటువంటి యువత మనకు కావాలి. రాబోయే వ్యవస్థ బాగుపడాలంటే ప్రతి విషయాన్నీ లోతుగా అధ్యయనంచేసి, ఆలోచించి, ప్రగతివైపు పయనించే వ్యక్తులు కావాలి. అందుకే శంకర్ వైపు తిరిగాను.

"చూడు శంకర్, ఈ వ్యవస్థలో అందరూ ఎమ్మీలుకారు. ఒక వావిలాల, ఒక జె.పి., ఒక కాకాని వెంకటరత్నం వంటి మహాపురుషులు ఆనాటి గాంధీ నుంచి ఈ నాటి వరకూ ఉన్నారు. కాకపోతే అటువంటి వాళ్లు తక్కువమంది. ఇటువంటి వాళ్లు ఎక్కువమంది. వీళ్లను పట్టించుకోవద్దు. వాళ్లను ఆదర్శంగా తీసుకో" అని శంకర్‌వైపు చూశాను. చెవులు రిక్కించి నా మాటలనే వింటున్నాడు. ఇప్పుడు శంకర్‌ని నేను కదిలించాలి. తప్పదు. అందుకే నా మాటలను కొనసాగించాను.

"నీవు తొమ్మిదవ తరగతిలో నీచుట్టూ ఉన్న కుటుంబాల్లో ఉన్న వ్యక్తుల జీవితాలను పరిశీలించి మాట్లాడావు. ఆనాడు వయసుకు మించిన నీ మాటలు అందరికీ నచ్చాయి. ఇప్పుడు సమాజాన్ని, మానవస్వభావాల్ని బాగా స్టడీ చేయాలి" ఒక్క నిమిషం ఆగాను. శంకర్ దీక్షగా వింటున్నాడు.




ఈ నాటి వ్యవస్థలో ద్వంద్వ ప్రవృత్తి చాలా ఎక్కువగా ఉంది. మాట్లాడేది ఒకటి, ఆచరించేది మరొకటి. స్వార్థం సుఖలాలసత్వం మనుష్యుల్ని అలా మార్చివేస్తోంది. ఏది మాట్లాడతారో, దాన్నే ఆచరించే వాళ్లు చాలా తక్కువ. బ్రాందీ షాపులో పనిచేయటం తప్పు అనుకోకు. అది నీ వృత్తి. దాన్ని నిషేధించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆచరించవలసిన బాధ్యత ప్రజలది. నిబద్ధత కలిగిన వ్యక్తులు ఈ సమాజానికి కావాలి. ఆ స్థాయి పొందదానికి నీ వంతు కృషి చేయి.

అప్పుడు ఒక అధికారిగా, ఒక పాలకునిగా నీవు అనుకున్నది చేయవచ్చు. నీవు ఒక ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. లేదా మంచి ఉపాధ్యాయుడిగా రాణించు. అందుకోసం ఇప్పుడు కష్టపడాలి. అనుకున్న గమ్యం చేరుకోవాలి.

"Awake and arise till you reach the goal..." అన్న వివేకానందుని మాటలను మననం చేసుకో. ముందు ముందు నీకు ఇటువంటి అనుభవాలు గుణపాఠాలై మార్గదర్శకంగా నిలుస్తాయి.

"ఎమ్మెల్యేలాంటి కొంతమంది మీలాంటి యువతను ఆవేశపెట్టి ముందుకు నడిపిస్తారు. మీరు లక్ష్యాన్ని మరిచి, తల్లిదండ్రుల ఆశలమీద నీళ్లు చల్లి ఇలాంటి వ్యవహారాలలో తలదూరుస్తారు. వాళ్ల పని పూర్తికాగానే, మిమ్మల్ని వదిలేస్తారు. వాళ్ల పిల్లలు మాత్రం డాక్టర్లు, ఇంజనీర్లు... ఇంకా ఏవేవో కావాలి, అవుతారు. మీరు మాత్రం అటూఇటుగాక దెబ్బతిని, చేతులు కాలాక ఆకులకోసం వెతకలేక ఇబ్బందులపాలవుతారు. ఇంతకన్నా నేను చెప్పేది లేదు. నీ ఇష్టం" అంటూ పైకి లేచాను.

"ఒక్కటి మాత్రం వాస్తవం. నీకు, నీ కుటుంబానికీ నేను, సుబ్బారావు ఎప్పుడూ అండగానే ఉంటాం. నువ్వు బాగా ఆలోచించి, వాస్తవాలు గమనించి నడుచుకో" చెప్పటం ఆపి, 'వస్తానురా' అన్నాను సుబ్బారావుతో.

శంకర్ రేపటి నుండి డ్యూటీ చేస్తాడు. నమ్మకంగా అంటూ ముందుకు నడిచాను ఆటో పిలుస్తూ.